



ధర్మవరం సమీపంలో సాగుకు సిద్ధం చేసుకున్న పొలాలు



రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులకు వరద పోటెత్తుతోంది. జలాశయాలు నిండి, గేట్లు తెరుచుకుంటున్నాయి. జిల్లా రైతన్న దుక్కి దున్నుకున్నాడు. విత్తనాలు సిద్ధం చేసుకున్నాడు. విత్తుకు సర్వ సన్నద్ధమయ్యాడు. జిల్లాలో కూడా రోజూ ఆకాశం మేఘావృతమవుతోంది. మేఘాలు కమ్ముకుంటున్నాయి. వర్షం పడితే విత్తనం వేద్దామని అన్నదాత రోజూ ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. మేఘాలు ఏర్పడడం, ఆషాఢ గాలులకు వెళ్లిపోవడం తప్ప.. చినుకు నేల రాలట్లేదు. ఈ పూటైనా పడకపోతుందా అని అన్నదాత ఆశపడడం తప్ప.. వరుణుడు కరుణించిన పాపాన పోలేదు. కార్తెలన్నీ కరిగిపోయాయి. నెలాఖరు వరకు వేరుశనగ విత్తుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నా.. రెండు, మూడు రోజుల్లో వర్షం కురవకపోతే.. తరువాత పంట వేసినా.. దిగుబడులు దక్కవని అన్నదాతలు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరుణుడు కరుణిస్తాడో.. ముంచేస్తాడోనని ఆందోళన చెందుతున్నారు. వర్షం రాకపోతే ఇప్పటికే పొలం దుక్కులు తదితరాలకు పెట్టిన పెట్టుబడి నేలపాలవుతుందని రైతులు వాపోతున్నారు.

మేఘావృతమైన ఆకాశం




ఆ శల కాశం..!

- రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు
- జిల్లాలో మాత్రం నేలరాలని చినుకు
- ఊరించి.. ఉసూరుమనిపిస్తున్న మేఘాలు
- విత్తుకు సిద్ధం చేసుకున్న రైతన్న
- వర్షం కోసం ఎదురుచూపులు
- అదునెళ్లిపోతుండడంతో ఆందోళన

ధర్మవరం రూరల్

రైతన్న ఆకాశం వైపే ఆశగా చూస్తున్నాడు. చినుకు జాడలేదు. రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆషాఢం సగం ముగిసింది. ఆకాశం మబ్బులతో నిండుకుంటోంది. ఆషాఢ గాలులతో మబ్బులన్నీ కరిగిపోతున్నాయి. రైతులు పొలాలను దుక్కి దున్నుకుని, విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. విత్తుకు రెడీగా ఉన్నారు. వరుణుడు కరుణించలేదు. కార్తెలు ముగుస్తున్నా చినుకు జాడలేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఏటా మృగశిర కార్తెలో అరకొరగా వర్షాలు కురిసేవి. ఆ తేమలోనే వేరుశనగ సాగుచేసేవారు. ఈసారి పదును వర్షం కురవకపోవడంతో దిగులు చెందుతున్నారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ సాగుకు అనుకూలమని రైతులు పేర్కొంటున్నారు. విత్తన సాగుకు మృగశిర, ఆరుద్ర, పునర్వసు కార్తెలు ప్రధానం. ప్రస్తుతం విపరీతమైన గాలులు వీస్తుండటంతో కమ్ముకున్న మేఘాలు చెదిరిపోతున్నాయి. ఖరీఫ్ సాగుకు వేలకు వేల రూపాయలు ఖర్చుపెట్టి సేద్యపు పనులుపూర్తి చేసుకుని, విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు వేసినా ప్రయోజనం ఉండదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా మృగశిర, ఆరుద్ర కార్తెల్లో పంటలు సాగుచేస్తే దిగుబడి బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



సాగుకు సిద్ధం

వేల రూపాయలు వెచ్చించి వేరుశనగ విత్తనాలను రైతులు సిద్ధం చేసుకున్నారు. ఈఏడాది ప్రభుత్వం కూడా ఆలస్యంగా విత్తన పంపిణీ చేయడంతో వాటిని సిద్ధం చేసుకునేలోపు ఆరుద్ర కార్తె వెళ్లిపోయింది. ప్రస్తుతం పునర్వసు కార్తె వచ్చినా పదును వర్షం కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సేద్యపుఖర్చులు, విత్తనాల కోసం ఎకరాకు రూ.5 వేలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టినట్లు రైతులు వాపోతున్నారు. వేరుశనగతోపాటు కందిపంట సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

జాడలేని రుతుపవనాలు

ఈ ఏడాది తొలినుంచీ రుతుపవనాల జాడే లేదు. సాధారణంగా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో రుతపవన ప్రభావంతో వర్షాలు కురుస్తాయి. ఈ ఏడాది జూన్ నెలలో మాత్రమే అరకొరగా వర్షాలు కురిశాయి. ఆ తరువాత పదును వర్షమే లేదు. పగలంతా మబ్బులతో మేఘాలు కమ్ముకుంటున్నాయి. చినుకు మాత్రం కురవట్లేదు. కార్తెలు ముగుస్తున్నా.. చినుకు జాడలేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

ప్రశ్నార్థకంగా సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండునెలలు అవుతోంది. మేఘాలు ఊరిస్తున్నా చినుకు పడలేదు. జూలై 15 దాటితే వేరుశనగకు అనుకూలంగా ఉండదని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు వర్షం రాకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం వర్షం కురిసినా వేరుశనగ కన్నా ప్రత్యామ్నాయ పంటల సాగు మేలని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ఈ ఏడాది విత్తన కేటాయింపులు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుకోసం జిల్లాలో 96,386 క్వింటాళ్లకుగాను 1,12,790 మంది రైతులకు విత్తనకాయలు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత నెల జూన్‌లో కురిసిన వర్షానికి అక్కడక్కడ జిల్లాలో వేరుశనగ, కంది పంట సాగుచేశారు. దీంతో జిల్లాలో ఈ ఏడాది 1,97,884 లక్షల హెక్టార్లకుగాను 48,234 హెక్టార్లలో వేరుశగన, కంది సాగయినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

తగ్గనున్న సాగు

జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ. గత నాలుగేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. గతంలో చేతికందే పంట అకాల వర్షాలతో నేలపాలవడంతో రైతులు వేరుశనగపై ఆసక్తి చూపట్లేదు. వేరుశనగకు పెట్టుబడి కూడా అధికంగా పెట్టాల్సి వస్తోంది. సేద్యపు పనులు మొదలు విత్తనాలు, మందులు, ఎరువులు, కూలీల ఖర్చు అధికంగా ఉంటోంది. దీనికి తోడు సకాలంలో వర్షాలు కురకవపోవడంతో పంట సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో కంది సాగుపై దృష్టి పెట్టారు. పంట సాగుకు పెట్టుబడి తక్కువ. తక్కువ వర్షపాత పరిస్థితులను తట్టుకుని దిగుబడి వస్తుంది. ధరలు కూడా ఆశాజనకంగా ఉంటాయి. ఈ కారణాలతో కంది వైపు జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు.



కార్తెలన్నీ ముగిసిపోతున్నాయి

కార్తెలన్నీ ముగిసిపోతున్నా చినుకు జాడలేదు. దీంతో ఆందోళనగా ఉంది. వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. కార్తెల్లో వర్షం రాకపోతే పంట వేసినా దిగుబడి రాదు. సకాలంలో వర్షం కురిస్తేనే పంటకు అనుకూలంగా ఉంటుంది.

- రామ్మోహన్‌రెడ్డి, నేలకోట, ధర్మవరం మండలం



వర్షం కోసం ఎదురుచూస్తున్నాం

ఆషాఢం గాలులతో వాన జాడ లేకుండా పోతోంది. ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేద్దామని విత్తనాలను సిద్ధం చేసుకున్నా. వర్షం కోసం ఎదురుచూస్తున్నా. అదును తప్పి వర్షాలు కురిస్తే పంట దిగుబడి తగ్గుతుందన్న ఆందోళన నెలకొంది. ఈ కార్తెలో కూడా వర్షం రాకపోయే ఆందోళనగా ఉంది.

- నరసింహారెడ్డి, తుమ్మల, ధర్మవరం మండలం

వారం రోజుల్లో వర్షం కురిసే అవకాశం



ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో వారం రోజుల్లోపు వర్షం కురిసే అవకాశం ఉంది. వర్షం కురిస్తే నెలాఖరులోగా వేరుశనగ సాగుచేసుకోవచ్చు. ప్రస్తుతం చిరుజల్లులు పడుతుండం ఇప్పటికే సాగుచేసిన పంటకు అనుకూలం. కంది, ఆముదం విత్తనాలను ఆగస్టు చివరి వారం వరకు విత్తుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

- జాన్సన్, పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

బరితెగింపు..!

- మఠం భూమిని వదలని అక్రమార్కులు
- విమర్శలు వస్తున్నా.. బేఖాతరు
- వేరొకరి పేరిట అనంతలో రిజిస్ట్రేషన్?
- కబ్జాదారులకు వంతపాడుతున్న రెవెన్యూ యంత్రాంగం
- ప్రైవేటు వ్యవహారమంటూ దాటవేత
- చోద్యంచూస్తున్న జిల్లా అధికారులు

ధర్మవరం/బత్తలపల్లి, జూలై 22: బత్తలపల్లిలోని నిడిమామిడి మఠం భూమి కబ్జాపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా.. కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకులు బరితెగిస్తున్నారు. ఎలాగైనా కైవసం చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఆ స్థలంలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేయడం, భూమి కబ్జాపై తీవ్ర వివాదం సాగుతున్నా.. తాజాగా వైసీపీ నాయకులు ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిసింది. ఎలాగైనా ఆ భూమిలో పేదలను గుడిసెలు వేయనీయకుండా కోర్టు మెట్లు ఎక్కాలని కుతంత్రాలు పన్నుతున్నట్లు చర్చ సాగుతోంది. ఆ మేరకు అనంతపురంలో మఠం భూమిలో సగాన్ని మరోవ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్‌గా మారింది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చక్రం తిప్పి మఠం భూమిని దాదాపు తమగుప్పిట్లోకి తీసుకోవడంలో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. పూర్తిగా సొంతం చేసుకునే సమయంలో పార్టీ అధికారం కోల్పోయింది. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ భూమిలోకి ఎవ్వరినీ రానీయకుండా చేసిన అప్పటి ప్రజాప్రతినిధి.. ప్రస్తుతం మాట మార్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ భూమితో తనకు సంబంధమేలేదని బుకాయిస్తుండటం పలువురిని ఆశ్చర్యానికి లోనుచేస్తోంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ యంత్రాంగం.. కబ్జాదారులకే వంతపాడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున అమ్యామ్యాలు పుచ్చుకున్న రెవెన్యూ యంత్రాంగం.. కబ్జాదారులను వెనకేసుకొస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. అది మంఠం భూమి అనీ, పూర్తిగా ప్రైవేటు వ్యవహారమని చెబుతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్, 1బీ జారీపై మాత్రం దాటవేస్తున్నారు. మఠం భూమిపై తీవ్ర వివాదం రేగుతున్నా.. జిల్లా ఉన్నతాధికారులు మౌనం పాటిస్తుండడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

రూ.100 కోట్లు..

బత్తలపల్లి సమీపాన 401 సర్వేనంబరులో కర్ణాటకకు చెందిన నిడిమామిడి మఠానికి సంబంధించి 19.84 ఎకరాల భూమి ఉంది. ఇది ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.వంద కోట్ల దాకా ధర పలుకుతోంది. దీనిపై గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కన్నేసి, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బట్టబయలదంతో సంచలనం రేగింది.



బత్తలపల్లి వద్ద మఠం భూమిలో వెలసిన గుడారాలు

గతేడాది ఫిబ్రవరి నెలలో దేవదాయ కమిషనర్ హరిజవహర్‌లాల్ బత్తలపల్లిలోని 401 సర్వే నంబరులోని 19.84 ఎకరాల భూమి నిడిమామిడి మఠానికి చెందినదనీ, క్రయవిక్రయాలు చేసే అధికారం ఎవ్వరికీ లేదని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ నాయకులు మాత్రం దశాబ్దాల క్రితమే భూమి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు చూపుతుండడం గమనార్హం. అప్పుడెప్పుడో భూమిని కొనుగోలు చేసినట్లయితే ఇన్నేళ్లపాటు స్వాధీనం చేసుకోకుండా ఎందుకున్నట్లు అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అప్పుడలా.. ఇప్పుడిలా..

నిడిమామిడి మఠం భూమితో తనకు సంబంధంలేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. కొందరు తనపై బురదజల్లే ఆరోపణలు చేస్తున్నారన్నారు. మఠం భూమిని ప్రభుత్వమే తీసుకుని, పేదలకు ఇంటిపట్టాలు పంపిణీ చేయాలనీ, లేదంటే వైసీపీ అధికారంలోకి రాగానే తామే ఇస్తామన్నారు. గత వైసీపీ హయాంలో మఠం భూమిలో పేదలకు స్థలాలివ్వాలని ప్రజాసంఘాలు కోరగా.. పోలీసులను పెట్టి వారిని ఇబ్బందులు పెట్టారన్న ఆరోపణలు మాజీ ఎమ్మెల్యే మూటగట్టుకున్నారు. అధికారం కోల్పోగానే.. మాట మారుస్తున్నారంటూ సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో భూమిని పేదలకు పంచనివారు మళ్లీ అధికారంలోకి వస్తే పట్టాలిస్తామని చెప్పడం శోచనీయమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మఠం భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి

- పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్
- కలెక్టరేట్ ముందు ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పేదలు

పుట్టపర్తి, జూలై 22: బత్తలపల్లి సమీపంలోని నిడిమామిడి మఠం భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బత్తలపల్లి మండలానికి చెందిన ప్రజలతో కలిసి సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో మఠం భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనీ, వెంటనే రద్దుచేసి ఇళ్లలేని నిరుపేదలకు పట్టాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ నాయకులు మధునాయక్, వెంకటరమణ, కళావతి, అనూష, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అశోక్, నరేంద్ర (ఫైల్ ఫొటోలు)





ఇంటి కాంపౌండ్‌లో పడివున్న నరేంద్ర, అశోక్ మృతదేహాలు



ఘోరం..

బైక్ బోల్తాపడి ఇద్దరు యువకుల దుర్మరణం

పెనుకొండ రూరల్, జూలై 22: మండలంలోని మునిమడుగు గ్రామంలో పీర్ల పండుగ పూట విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన యువకులు, స్నేహితులు అశోక్ (20), నరేంద్ర (20) మండలంలోని గుట్టూరు సమీపాన సోమవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన ప్రమాదంలో దుర్మరణం చెందారు. కియ స్టేషన్ ఎస్‌ఐ రంగడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునిమడుగు గ్రామానికి చెందిన హరిజన పెద్దన్న, గంగమ్మ దంపతుల కుమారుడు నరేంద్ర బెంగళూరులో కారు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అదే ఊరికి చెందిన నాగన్న, నరసమ్మ దంపతుల కుమారుడు అశోక్ కియ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. మొహరం పండుగకు బెంగళూరు నుంచి నరేంద్ర స్వగ్రామానికి రెండురోజుల క్రితం వచ్చాడు. ఈ నేపథ్యంలో మిత్రుడు అశోక్‌తో కలిసి ద్విచక్రవాహనంలో పనినిమిత్తం గుట్టూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుట్టూరు సమీపంలోని మంచినీళ్ల మునెప్ప ఇంటి వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి బండకు ఢీకొని పల్టీలు కొట్టింది. బైక్‌లోని ఇద్దరు మునెప్ప ఇంటి కాంపౌండ్‌లోకి ఎగిరి పడ్డారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, మృతదేహాలను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. యువకుల మృతి విషయం తెలియగానే కుటుంబీకులు, బంధువులు ప్రమాద స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. మునిమడుగు గ్రామంలో సోమవారం మొహరం ఉత్సవాల్లో భాగంగా పానకాల నిర్వహించారు. మంగళవారం పీర్ల జలధి. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన యువకులు మరణించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

క్షేత్రస్థాయిలో పర్యటించి.. సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, జూలై 22: ప్రజల నుంచి వచ్చే పిర్యాదులపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ప్రజల నుంచి 266 అర్జీలు అందాయి. వాటిని కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల ప్రత్యేక అధికారులు ప్రతి శుక్రవారం హాస్టళ్లు, రైతుసేవాకేంద్రాలు, ఆస్పత్రులను తనిఖీచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయాశాఖల పరిధిలోని కోర్టు కేసులపై జిల్లాస్థాయి అధికారి సమీక్షించుకుని పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 15 మంది దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయాల కోఆర్డినేటర్ శివారెడ్డి పాల్గొన్నారు.

10 రోజుల్లోగా పరిష్కారం చూపాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, జూలై 22: ప్రజాసమస్యలకు పది రోజుల్లోగా పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రత్న ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి ఎస్పీ 36 అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు సావధానంగా విన్న ఎస్పీ.. సంబంధిత పోలీసు అధికారులకు పంపి, పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధుల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిస్తూ సత్వరమే సమగ్రవిచారణ చేపట్టి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

విద్యుత్ అంతరాయాలపై అన్నదాతల ఆగ్రహం

కదిరి, (అమడగూరు), జూలై 22: విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమడగూరు మండలం చినగానిపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన విద్యుత్ రైతులు సోమవారం మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ... విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో పంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. అరగంటపాటు ధర్నా కొనసాగించారు. ఏడీఈ ఓబులేసు అక్కడికి చేరుకుని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

హెచ్చెల్సీకి నీటి విడుదల



నదిలోకి నీరు..



స్విచ్ ఆన్ చేస్తున్న బోర్డు సెక్రెటరీ ఓఆర్కే రెడ్డి


రాయదుర్గం, జూలై 22: తుంగభద్ర ఎగువకాలువ(హెచ్చెల్సీ)కు సోమవారం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువకాలువకు సంబంధించిన షట్టర్ల స్విచ్‌లను ఆన్‌చేసి వంద క్యూసెక్కుల నీటిని బోర్డు కార్యదర్శి ఓఆర్కే రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు గంగపూజ చేశారు. క్రమేపీ నీటి విడుదలను పెంచుతూ రోజుకు 500 క్యూసెక్కులను విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ఆంధ్ర వాటా నీటిని మాత్రమే అందిస్తున్నారు. మంగళవారం నుంచి కర్ణాటక వాటాను కూడా విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. రాత్రి 9గంటలకు 88.35 టీఎంసీలకుపైగా జలాశయంలో చేరాయి. మంగళవారం రాత్రికి హెచ్చెల్సీ నీరు కణేకల్లుకు చేరనుంది.

పోటెత్తిన వరద

తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువన ఉన్న తుంగ జలాశయం నిండటంతో ప్రస్తుతం 93698 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి చేరుతోంది. జలాశయం సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా ఇప్పటికే 88.35 టీఎంసీల నీరు జలాశయంలోకి చేరాయి. దీంతో అధికారులు అప్రమత్తమై మూడుగేట్లు ఎత్తి ఐదువేల క్యూసెక్కుల నీటిని నదికి సోమవారం వదిలారు. జలాశయానికి 33 క్రస్ట్‌గేట్లు ఉండగా, నీటి చేరిక ఆధారంగా మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

హెచ్చెల్సీకి 26.28 టీఎంసీల నీటి కేటాయింపులు

అనంతపురం క్లాక్‌టవర్: ఈ ఏడాది టీబీ డ్యాంలో నీటి నిల్వ 172టీఎంసీల ఆధారంగా హెచ్చెల్సీకి 26.28టీఎంసీల నీరు కేటాయించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సోమవారం టీబీ డ్యాం నుంచి బోర్డు సెక్రటరీ ఓఆర్కే రెడ్డి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు. టీబీ డ్యాం నుంచి ఈనెల 26వతేదీ వరకు 500 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారని, 27నుంచి 750క్యూసెక్కుల వరకు, పెంచుతారని ఎస్ఈ రాజశేఖర్ పేర్కొన్నారు. ఇప్పటికే హెచ్చెల్సీకి తాత్కాలిక మరమ్మతులు పూర్తిచేశామని, కాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు 23 అర్ధరాత్రి లేదా 24 ఉదయానికి ఆంధ్రా సరిహద్దు హెచ్చెల్సీ 109కిలోమీటరుకు చేరుతాయని తెలిపారు. నీరు ఎక్కడా లీకేజీ కాకుండా, కాలువను పటిష్ఠ పరుస్తున్నామన్నారు. టీబీ డ్యాం నుంచి వచ్చే నీటిని రిజర్వాయర్లలో పూర్తిగా నింపుకున్న తరువాత ఐఏబీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తొలుత తాగునీటికే అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.



తుంగభద్ర ఎగువ కాలువకు విడుదలవుతున్న నీరు

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, జూలై 22: బీసీ సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ సత్యసాయిజిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 60రోజుల పాటు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. 70శాతం హాజరున్నవారికి మాత్రమే స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 200మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు మార్కులజాబితా, టీసీ, డిగ్రీ, మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాసుపుస్తకంతో కూడిన దరఖాస్తులను పెనుకొండ పోలీస్‌స్టేషన్ పక్కనున్న బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

చీనీ టన్ను రూ.20వేలు



అనంతపురం రూరల్, జూలై 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1337టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.47



అనంతపురం రూరల్, జూలై 22: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.34, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా రమేష్ బాబు



రమేష్‌బాబుకు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ

అనంతపురం సెంట్రల్, జూలై 22: ఎస్కేయూ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఈరమాసి రమేష్‌బాబు నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య పదవీకాలం ఆదివారంతో ముగిసింది. దీంతో నూతన రిజిస్ట్రార్‌గా రమేష్ బాబును నియమిస్తూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబుకు అభినందనలు వెల్లువెత్తాయి. పలువురు బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కళ్యాణదుర్గం మండలం బట్టువానిపల్లికి చెందిన రమేష్ బాబు ఎస్కేయూలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం 2000 సంవత్సరంలో రీసర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. రిటైర్‌మెంట్, పెన్షన్ విభాగంలో పనిచేస్తూ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. దీంతో వర్సిటీ ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. రమేష్‌బాబు స్వగ్రామం బట్టువానిపల్లిలో ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్‌తోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులకు రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు తిమ్మప్ప, ఉమాపతి, లోకేష్, మద్దిలేటి, శ్రీరాములు, లక్ష్మీరామ్, టైంస్కేల్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యక్షులు శివయ్య, ప్రధానకార్యదర్శి సంజీవప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నారాయణప్ప, రమేష్, హనుమంతు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జూలై 22: నిరుద్యోగ యువతకోసం బుధవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి సోమవారం తెలిపారు. రిలయన్స్ నిప్పో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పనిచేసేందుకు అర్హుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన 45 ఏళ్లలోపు వయసు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 08554- 245547 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

పెండింగ్ రోడ్లను పూర్తి చేయాలి

పార్లమెంట్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, జూలై 22: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో కోరారు. సోమవారం జరిగిన వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ.. రూ.995.09 కోట్లతో 2016 సంవత్సరంలో ప్రారంభమై 2018 నాటికి పూర్తి కావాల్సిన గుత్తి-గుంతకల్లు జాతీయ రహదారి పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిపోయాయన్నారు. రహదారిలో గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్‌ను మార్చి త్వరగా పనులు చేపట్టాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరు నుంచి పత్తికొండ, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా పావగడ, మడకశిర వద్ద జాతీయ రహదారిని కలిపేలా నూతన జాతీయ రహదారితోపాటు, బళ్లారి నుంచి బొమ్మనహాళ్, గుండ్లపల్లి, వేపరాళ్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఈ రహదారుల వల్ల అనంత జిల్లా మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాజేష్

అనంతపురం కల్చరల్, జూలై 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్చకులకు నిలిచిపోయిన డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను పునరుద్ధరించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డిపల్లి రాజేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో సోమవారం అర్చక సమావేశం నిర్వహించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాజేష్ మాట్లాడారు. రకరకాల కారణాల వల్ల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా దేవాలయాలు డీడీఎన్ఎస్ పథకానికి దూరంగా ఉన్నాయన్నారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 475 దేవాలయాలను డీడీఎన్ఎస్ కింద ఎంపిక చేసినప్పటికీ పథకం అమలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం కాలక్షేపం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అయినా డీడీఎన్ఎస్, డెత్ గ్రాట్యుటీలను అమలు చేసి అర్చకులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి శ్రీనివాసులు, కొమండూరు మారుతిప్రసాద్, ముచ్చుకోట ప్రసాద్, భక్తరహళ్లి వేణుగోపాల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఈఓ

అనంతపురం విద్య, జూలై 22: జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓగా ప్రభాకర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ ఆఫీసర్(డీపీఓ)గా పనిచేస్తున్న ప్రభాకర్‌రావును ఇన్‌చార్జ్ సీఈఓగా జిల్లా కలెక్టర్ నియమించారు. దీంతో సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆయన జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత జడ్పీ సీఈఓ ఛాంబర్‌లో ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జడ్పీఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బిల్లు కట్టేది ఎలా..?

- విద్యుత్ బిల్లు చెల్లింపునకు వినియోగదారుల పాట్లు
- పనిచేయని ఏపీఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- విద్యుత్ కౌంటర్లకు క్యూకడుతున్న ప్రజలు
- తగ్గిన విద్యుత్ బిల్లు చెల్లింపులు



పవర్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ బిల్లు చెల్లింపునకు క్యూ

అనంతపురం రూరల్, జూలై 22: విద్యుత్ బిల్లుల చెల్లించేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు చెల్లింపునకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ వల్ల ఉపయోగం లేకుండా పోయింది. డిస్కం వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు సర్వర్ కష్టాలు తలెత్తుతున్నాయి. వినియోగదారులకు కనీస అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. దీనికితోడు ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలకు మరింత వినియోగదారులకు భయపడిపోతున్నారు. ఈక్రమంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలకు క్యూకడుతున్నారు. కాగా ఈ ప్రభావం విద్యుత్ బిల్లులు వసూళ్లపై పడుతోంది. ఇందుకు ఈనెలలో ఇప్పటి వరకు వసూలైన కలెక్షన్సే నిదర్శనం. గత నెల 22(జూన్)కి రూ.64.54కోట్లు వసూలైంది. ఈ నెలలో రూ. 44.93కోట్లు మాత్రమే వసూలైంది. ఇప్పటి వరకు దాదాపు రూ.20కోట్ల మేర ఈనెల విద్యుత్ బిల్లుల చెల్లింపులు తగ్గిపోయాయి.

పనిచేయని క్యూఆర్ కోడ్

ఈనెల మొదటి నుంచి ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం, ఇతర యూపీఐ యాప్‌ల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ నిలిపేసింది. కేవలం సంస్థ కస్టమర్ యాప్, డిస్కం వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించాలని సంస్థ సూచించింది. ఈక్రమంలోనే విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాల వద్ద కస్టమర్ యాప్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. అయితే వాటివలన వినియోగదారులకు ఏమాత్రం ప్రయోజనం కలగడం లేదు. వినియోగదారులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా బిల్లు చెల్లింపు ప్రక్రియ ఓపెన్ కావడం లేదు. అలాగే వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. వెబ్‌సైట్ ద్వారా అన్ని వివరాలు నమోదు చేసి, సబ్మిట్ కొట్టిన తరువాత యూపీఐ అడుగుతోంది. అక్కడ ఫోన్‌పే, గూగుల్ పే వంటి వాటి ద్వారా చెల్లించేందుకు వినియోగదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రక్రియ మొత్తం పూర్తి అయి అమౌంట్ కూడా చెల్లిస్తున్నారు. ఆతరువాత నాలుగు నిమిషాల టైం లిమిట్ పడుతోంది. ఆతరువాతైనా బిల్లు చెల్లింపు పూర్తి అవుతుందా అంటే లేదు. సర్వర్ సమస్యతో పేమెంట్ అన్ సక్సెస్ అని చూపుతోంది. పలుమార్లు ఇదేవిధంగా వినియోగదారులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతరవాటి ద్వారా బిల్లులు చెల్లింపులకు అలవాటుపడిన వినియోగదారులు కొత్త విధానంతో ఇబ్బందులు పడుతున్నారు.



ఏపీఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ క్యూఆర్‌కోడ్

అవగాహన కల్పిస్తాం



విద్యుత్ బిల్లులు డిస్కం యాప్‌ల ద్వారా చెల్లించాలి. ఈక్రమంలోనే బిల్లులు చెల్లింపు కొత్త విధానంపై క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, సిబ్బందితో వినియోగదారులకు అవగాహన కల్పించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. ఇదే క్రమంలో వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలు పెంపునకు చర్యలు చేపడతాం. ఆమేరకు శాఖలోని ఉద్యోగులు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

- రాజశేఖర్, ఈఈటీ, విద్యుత్ శాఖ

భూ తగాదాతోనే హత్య

- బావను హత్య చేసిన బావమరిది
- ఆటోడ్రైవర్ హత్యకేసు నిందితుల అరెస్టు

ధర్మవరంరూరల్, జూలై22: ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ హత్యకేసును ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజీజాన్‌సైదా హత్యకేసుకు సంబంధించి వివరాలను విలేకరులకు సోమవారం వెల్లడించారు. తాడిమర్రికి చెందిన సూర్యనారాయణ చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామంలో 23 ఏళ్లకిందట క్రిష్ణవేణిని పెళ్లి చేసుకున్నాడు. భార్యతో కలిసి అక్కడే ఉండేవాడు. క్రిష్ణవేణి తండ్రి చనిపోగా తల్లి సాలమ్మ పేరు మీద మొత్తం భూమి ఉంది. వారం రోజుల కిందట భూమి విషయంపై క్రిష్ణవేణి అన్న ఏలూరు మల్లికార్జునతో సూర్యనారాయణ గొడవ పడ్డాడు. ఈ భూమిని దక్కించుకోవడం కోసం మల్లికార్జున తన బావ అయినా సూర్యనారాయణను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈక్రమంలో ఈనెల 19న రాత్రి ఆటో తోలుకుంటూ వెల్దుర్తికి వెళుతున్న సూర్యనారాయణను సీసీకొత్తకోట సమీపంలో ఉడుతరాళ్ల పొలం వద్ద ఆపారు. భూమి విషయం మాట్లాడుదామని పక్కకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే మల్లికార్జున, ఆయన కుమారుడు చాకలిరాము, అల్లుడు రాజు, సమీప బంధువైన లక్ష్మీనారాయణతో కలిసి సూర్యనారాయణ తలపై రాడ్డుతో కొట్టారు. చేతులు కాళ్లు కట్టేసి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు ఛేదింపు కోసం ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజీజాన్‌సైదా ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్రతో కలిసి ప్రత్యేక టీంను ఏర్పాటుచేసి దర్యాప్తును వేగవంతం చేశారు. లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు బావమరిదే బావను హత్య చేసినట్లు విచారణలో తెలుసుకున్నారు. దీంతో సోమవారం నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపామన్నారు. హత్యకు వాడిన రాడ్డు, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్ర, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

చౌక ధరల ధాన్యం డిపోల్లో బియ్యం స్వాహా

గుమ్మఘట్ట, జూలై 22: మండలంలోని వివిధ గ్రామాల్లో చౌకధాన్యపు డిపోల్లో డీలర్లు బియ్యం, జొన్నలు స్వాహా చేశారని సీఎస్‌డీటీ సుదర్శనాచారి పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా డీలర్లు డిపోలు నడుపుతూ ప్రజలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని సక్రమంగా అందించకుండా నిల్వలు చూపుతూ వస్తున్నారన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో చౌక ధరల ధాన్యపు డిపో డీలర్లను మారుస్తారన్న అనుమానంతో డిపోలో చౌకబియ్యం నిల్వలు లేకుండా స్వాహా చేసినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికే అలాంటి డిపోలను పది దాకా తనిఖీ చేసి కేసులు నమోదు చేశామన్నారు. మరిన్ని డిపోలు తనిఖీ చేసి అక్రమాలు తేలితే డీలర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రభుత్వ అధికారులకు స్వాధీన పరచాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటిదాకా 75 వీరాపురం షాప్ నంబర్ 15లో 28.34 క్వింటాళ్లు, తాళ్లకెర నాలుగోషాప్‌లో 36 క్వింటాళ్లు, ఐదోషాప్‌లో 30 క్వింటాళ్లు, గుమ్మఘట్ట ఒకటిలో 30 క్వింటాళ్లు, రెండులో 17.50 క్వింటాళ్లు, బేలోడులో 17 క్వింటాళ్లు, కలుగోడు మూడులో 24 క్వింటాళ్లు, రంగచేడు 24వ షాప్‌లో 18.59 క్వింటాళ్లు, గొల్లపల్లి షాప్ 15లో 19.5 క్వింటాళ్లు చౌకబియ్యం స్వాహా చేసినట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలిసింది.

మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్ఎస్‌పీఆర్ విద్యార్థినికి బంగారు పతకం



అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

హిందూపురం అర్బన్, జూలై 22: మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినికి బంగారు పతకం దక్కినట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలి పారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కళాశాల విద్యార్థిని అర్పిత బంగారు పతకం సాధించిందన్నారు. ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలకు కరాటే విద్య ఎంతో అవసరమ న్నారు. ఆత్మరక్షణకు ప్రతి మహిళ కరాటే నేర్చుకోవాల న్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ రామచంద్రకు ధన్యవాదాలు తెలిపారు. అర్పితకు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, సభ్యులు తుల్జాబాయి, భువన, అశ్వత్థలక్ష్మి, పద్మ తదితరులు ఆర్థికసాయం అందించారు.

సార్..! అద్దె ఇప్పించండి..

- ఎన్నికలు ముగిసి రెండునెలలైనా పట్టించుకోరా?
- బిల్లులు ఎవరిని అడగాలో తెలియక తికమక
- డీటీసీ ఎదుట వాహన యజమానుల ఆవేదన



డీటీసీ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న వాహన డ్రైవర్లు

అనంతపురం టౌన్, జూలై 22: ఎన్నికల సందర్భంగా తిప్పిన వాహనాలకు అద్దె చెల్లించాలని వాటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు దాటిపోయినా ఇంత వరకు తమకు వాహనాల అద్దె చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిర్వహణకు నియమితులైన అధికారులు, పోలీస్ యంత్రాంగం అనేక అద్దె వాహనాలను వినియోగించుకున్నారు. డీటీసీ ద్వారా ఆ వాహనాలను సమకూర్చుకున్నారు. రవాణాశాఖాధికారులు చెప్పిన మేరకు కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి వాహనదారులు ఎన్నికల విధుల్లో సాయపడ్డారు. 24గంటలపాటు అక్కడే ఉండి అధికారుల వెంట వాహనాలను తిప్పారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.1500 బాడుగ, రూ.1200 డ్రైవర్‌కు బత్తా రూపంలో చెల్లిస్తారని రవాణా అధికారులు చెప్పారు. జిల్లాలోని అనంతపురం, శింగనమల, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు ఈవాహనాలను వాడుకున్నారు. ఎన్నికలు ముగిసి రెండునెలలు కావస్తున్నా ఆవాహనాలకు అద్దె బిల్లులు చెల్లించలేదు. ఎన్నికల అధికారులను అడిగితే కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓలను అడగండంటున్నారు. పోలీసులకు వినియోగించిన వాహనాల యజమానులు వెళ్లి అడిగితే ఎస్పీని అడగాలంటున్నారు. ఆ వాహన యజమానులు, డ్రైవర్లు వారివద్దకు వెళ్లి అడగలేక సతమత అవుతున్నారు. వాహనాలను పంపించిన రవాణాశాఖ అధికారులను అడిగితే ఇపుడు మాకు సంబంధం లేదు రెవెన్యూ, ఎస్పీలనే అడగాలంటున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కొందరు వాహనడ్రైవర్లు కలెక్టరేట్‌లోని మీకోసంకు వచ్చారు. అక్కడ కలెక్టరు లేకపోవడంతో డీటీసీని కలిసి తమ వాహనాల అద్దె గోడును వెల్లబోసుకున్నారు. అపుడు కూడా డీటీసీ ఈ అద్దెలు రెవెన్యూ, ఎస్పీల వద్దకే వెళ్లి అడగాలని సూచించారు. దీంతో అద్దె ఎవరిస్తారో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎన్నికల విధులకు ఖర్చుపెట్టిన అనేక విషయాలలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో ఈవాహనాల బిల్లులు ఏమి చేశారోనన్న విమర్శలు వస్తున్నాయి.

తాగునీటి సమస్య పరిష్కరించండి


వినతిపత్రం ఇస్తున్న పీటీ కాలనీ వాసులు

ధర్మవరం, జూలై 22: పట్టణ సమీపంలోని పోతులనాగేపల్లి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో దాదాపు 200 కుటుంబాలు ఉన్నాయని, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా మని వాపోయారు. చివరికి నీళ్ల ట్యాంకుకు రూ.400 వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు రామాంజినేయులు, సునంద, శ్రీనివాసులు, శ్రీరాములు, రవికుమార్, గోవిందు, జయచంద్ర, బాలు, సుధాకర్ విన్నవించారు. స్పందించిన కమిషనర్ త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి


అమడగూరులోని ప్రమాదకర మలుపు

కదిరి (అమడగూరు), జూలై 22: అమడగూరు బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మూడు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేక పోవడం... నిత్యం రద్దీ ప్రాంతం కావడంతో పలు ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి.. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్ధరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ధర్మవరం, జూలై 22: ఆషాఢ మాసం సోమవారం సందర్భంగా స్థానిక చెరువు కట్ట వద్ద గల సిద్ధరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాన్ని తులసి ఆకులతో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


తులసీ ఆకులతో శివలింగానికి అలంకరణ

అనారోగ్యంతో కాంట్రాక్టు ఉద్యోగి మృతి


వెంకటరాముడు (ఫైల్)

ధర్మవరం, జూలై 22: ధర్మవరం మున్సిపాలిటీలో కాంట్రాక్టు పద్ధతిన వాటర్ సప్లై పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న బొగ్గు వెంకటరాముడు (56) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. అయన మృతదేహానికి తోటి మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. మున్సిపల్ ఉద్యోగులు తమవంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళుర్పించిన వారిలో మున్సిపల్ వాటర్‌సప్లై కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ నాయకులు మహేశ్, దాసరి సురేశ్, రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు.

పారిశుధ్య చర్యలు

ధర్మవరం, జూలై 22: వార్డ్ వాచ్‌లో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 34వ వార్డులోని డ్రైనేజీలను టీడీపీ నాయకులు శుభ్రం చేయించారు. ముళ్లకంపలను తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మాధవరెడ్డి, 34వ వార్డు ఇన్‌చార్జ్ ముతుకూరు బీబీ, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు నాగుర్ ఉమర్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు గ్రామంలో డయేరియా కట్టడి చర్యల్లో భాగంగా రెండు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామసర్పంచ్ పిట్టా నరసమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని వీధివీధినా పరిసరాలను శుభ్రం చేయించారు. మురుగునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు : డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు తెలిపారు. ఉర్దూ పాఠశాల, పోలీస్ స్టేషన్ వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాలను, మురుగును తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఏఎన్ఎం అనురాధ, ఆరోగ్య కార్యకర్త ముసలిరెడ్డి, ఆశకార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన గురుపౌర్ణమి వేడుకలు


లక్ష కుసుమార్చన చేస్తున్న అర్చకులు

ధర్మవరం,జూలై 22: స్థానిక సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గురుపౌర్ణమి వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా షిర్డీసాయిబాబా ఆలయంలో ఏకవాం, అభిషేకం, లక్ష కుసుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు సాయినాథుడికి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు బంధనాధం సూర్యప్రకాశ్, వీరనారాయణ, రాంప్రసాద్, హేమంత్ కుమార్, జేసీనాయుడు, రామలింగయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.



కుక్కల బెడద

నంబులపూలకుంట, జూలై 22: మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి వేళల్లో గుంపులు.. గుంపులుగా... రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఇళ్ల నుంచి రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాదారులను రాత్రి సమయంలో కుక్కలు వెంబడిస్తున్నాయని, దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదలాలని కోరుతున్నారు.

ప్రధాన రహదారి గుంతలమయం

ఓబుళదేవరచెరువు, జూలై 22: కదిరి, హిందూపురం ప్రధాన రహదారి గుంతలయంగా మారింది. వీటికి తోడు వర్షాకాలంలో చిన్నగా ఏర్పడిన గుంతలు కాస్త పెద్దగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో బైక్ అదుపు తప్పి.. కింద పడి గాయపడుతున్నారు. ప్రధానంగా వడ్డివారిపల్లి, ఓడీ చెరువు ప్రధాన రహదారి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వైఎస్ఆర్ సర్కిల్‌లో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణీకులు కోరుతున్నారు.



గుంతలు ఏర్పడిన రహదారి

రియల్టర్ల దందా

- డీకేటీ భూముల కొనుగోలు
- కాలువలు సైతం కబ్జా
- రూ.కోట్లు గడిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు


వెంచర్‌కు తోలిన మట్టి

గాండ్లపెంట, జూలై 22: ప్రభుత్వం మారినా ఇక్కడి రియల్టర్ల దందా ఏ మాత్రం తగ్గలేదు. మండల పరిధిలోని రెక్కమానులో కదిరి, రాయచోటి ప్రధాన రహదారి సమీపంలో డికెటి భూములున్నాయి. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ.కోటి పలుకుతోంది. దీంతో రియల్టర్లు ఆ భూములను పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి.. వాటిలోని కాలువలు సైతం కబ్జా చేసి... ప్లాట్లుగా మార్చి.. అమ్ముకుంటూ రూ. కోట్లు గడిస్తున్నారు.

డీకేటీ భూముల విక్రయాలు

గతంలో నిరుపేదలు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వం డీకేటీ భూములకు పట్టాలిచ్చింది. ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్టర్లు పేదలకు కాస్తోకూస్తో సొమ్ము ఇచ్చి ప్రభుత్వ భూములను చట్టవిరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారు. వాటిలో ప్లాట్లు వేసి, ప్రజలకు అమ్మి రూ. కోట్లు సొమ్ము చేసుకొంటున్నారు. ఇలా డికెటి భూములను విక్రయిస్తున్నా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు మామూళ్లు తీసుకోవడంతో వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

కాలువలు సైతం కబ్జా

రియల్టర్లు చట్టవిరుద్ధంగా డికెటి భూములను కొనుగోలు చేయడమే కాకుండా... ఆ ప్రాంతాల్లోని కాలువలు సైతం కబ్జా చేస్తున్నారు. రెక్కమాను వద్ద పలు కల్వర్టులున్నాయి. అయితే అటువైపు భూముల నుంచి ఇటువైపు వాగుల ద్వారా చెరువులోకి నీరు వెళ్లాల్సి ఉంది. రియల్టర్లు మాత్రం నీరు చెరువులకు చేరకుండా వంకల్లో మట్టి తోలి పూడ్చి వేసి.. ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఇలా వీరు ఇలా బరితెగిస్తున్నా... ఇటు పంచాయతీ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం.. పలు అనుమానాలకు తావిస్తోంది.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

రియల్టర్ల తాము కొన్న భూములను చదును చేయడానికి... ఆ ప్రాంతా ల్లోని వంకల ను పూడ్చి వేయ డానికి కొండగు ట్టల నుంచి యథేచ్ఛగా మట్టిని తవ్వి తర లిస్తున్నారు. దీనిపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రియల్టర్ల దందా మూడు పూవ్వులు, ఆరుకాయలుగా కొనసా గుతోంది. రియల్టర్లు భూములు చదును చేయడా నికి కొట్టగుట్టలో జేసీబిలు, ట్రాక్టర్లతో రాత్రింబవళ్లు మట్టిని తరలించుకుంటున్నారు.

చర్యలు శూన్యం

రియల్టర్లు ప్రభుత్వ అనుమతులు లేకుండా యథేచ్ఛగా ప్లాట్లు వేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. రియల్టర్లు ప్లాట్లు వేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. రోడ్లు, మురుగునీటి కాలువలు, విద్యుత్, బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయాలకు కొంత భూమిని అప్పగించాల్సి ఉంది. ఇప్పటికే మండలంలో పలువురు ప్లాట్లు వేసి విక్రయించారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తీ చూడకపోవడం విడ్డూరం.


కాలువలను సైతం మట్టితో పూడ్చిన దృశ్యం


కొండగుట్టల్లో మట్టిని తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

పరిశీలిస్తాం

ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు వేసి, చదును చేసి ఉంటే వాటిని పరిశీలిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

\- శ్రావణి, తహసీల్దార్, గాండ్లపెంట

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి: కలెక్టరు


విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టరు


ధర్మవరంలో విద్యార్థులతో ఎంఈఓలు

పుట్టపర్తి, జూలై 22: ప్రతి విద్యార్థిలోను అంతర్గతంగా సృజనాత్మకత ఉంటుందని, వాటిని వెలికితీసేందుకు విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కలెక్టరు టీఎస్ చేతన్ సూచించారు. స్థానిక ఎనుమలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం పాటు నిర్వహించే శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్నిపాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యత, సాంస్కృతికత, ఆటల్లో ప్రావీణ్యత తదితర వాటి గురించి తెలుసు కోవాలన్నారు. విద్యార్థులకు సృజనాత్మ కంగా కొత్త వాటిని తయారుచేసేందుకు ఉపాధ్యాయులు సూచనలు ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, హెచ్‌ఎం రాదాకృష్ణ పాల్గొన్నారు.

ధర్మవరం: స్థానిక బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1రాజేశ్వరిదేవి, ఎంఈఓ-2 గోపాల్ నాయక్ హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన బోధన సామగ్రిలను పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఉమాపతిని ఎంఈఓలు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కదిరి అర్బన్, జూలై 22: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కదిరి డిపో మేనేజర్ మైనోద్దీన్‌కు ఎన్ఎంయూఏ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఉద్యోగ భద్రతలపై ఇచ్చిన సర్క్యులర్ 1/2019ను యథాతథంగా అమలు చేయాలన్నారు. డిపోలో డ్రైవర్లు, కండెక్టర్లకు టిమ్ మిషనల్ మరమ్మతులపై ఎలాంటి ఆధారం లేకుండా ఒక్కొక్కరికి రూ. ఆరు వేలుగాపై రికవరీ చేస్తున్నారని, ఇందులో ఉద్యోగి బాధ్యత ఉన్నదా లేదా అని విచారణ చేయకుండా రికవరీ చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే అక్రమ ఉత్తర్వులు నిలిపివేసి, ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. డ్రైవర్లు తప్పులేన్నా, స్పింగ్, టైర్ డేమోజీలను ఇష్టానుసారంగా రికవరీ చేస్తున్నారని తెలిపారు. రోడ్డు కండీషన్, ఓవర్‌లోడ్, టైర్ల పరిస్థితి పరిగణించకుండా రికవరీలు చేయడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏఎఎస్ గ్రేడ్ -1 పదోన్నతులు కల్పించాలన్నారు. కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్లపై వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షుడు రామక్రిష్ణ, కార్యదర్శి బైరిశెట్టి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

ముదిగుబ్బ, జూలై 22: స్థానిక పాతవూరులో సోమవారం పీర్ల పండుగ సందర్భంగా చివరిరోజైన సోమవారం ఉరుసు కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పీర్ల స్వాములను పూల షేరాలు, కొత్త బట్టలతో అలంకరించారు. గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్ల స్వాములకు పూల షేరాలు, పూల దండలు, వెండి గొడుగులు, చక్కెరతో చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చిన్న చావిడి వద్ద ఉరుసు మహోత్సవం నిర్వహించారు. యువకులు అల్లావు తొక్కుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

నల్లమాడ, జూలై 22: మండలంలోని రామాపురం వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సీహెచ్ఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు సోకే విధానాన్ని వివరించారు. ప్రతి ఒకరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి: ఎస్పీ


సెబ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 22: జిల్లాలో అక్రమ మద్యం, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ వీ రత్న సెబ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సెబ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం రవాణా తది తర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు. సెబ్ అధికారి సుబ్రహ్మణ్యం ఎస్పీకి పుష్పగుచ్ఛం అందచేసి.. శుభాకాంక్షలు తెలిపారు.

శాఖలవారీగా సమీక్ష

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న శాఖల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. విధులపట్ల అలసత్వం లేకుండా అంకిత భావంతో పనిచేసే సిబ్బందికి తనవంతు సహాయసహకారాలు ఉంటాయన్నారు. శాఖలవారీ విధుల్లో ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తేవాలన్నారు. ఐటీకోర్ టీం, జిల్లా క్రైం బ్రాంచ్ సిబ్బంది వివరాలు ఏ శాఖలో ఎంత మంది ఉన్నారోనన్న విషయాలను రోజువారి వారు నిర్వహించాల్సిన విధులపై సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు.

పలువురి శుభాకాంక్షలు

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ రత్నను సోమవారం జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయ కులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు సంక్షేమానికి సహకారాలు అందించాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో జిల్లా పోలీసుల అధికారుల సంఘం నాయకులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్లహరినాథ్, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ, దాదాపీర్ పాల్గొన్నారు.

చిలకం శుభాకాంక్షలు

ధర్మవరం: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి చిలకం మధుసూదన్ రెడ్డి జిల్లా నూతన ఎస్పీ రత్నను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో ఆమెకు పుష్పగు చ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


రీమాతబ్సుమ్ ఆపషా ఆఫీసా విద్యాప్రియ హెప్సిబా

జడ్పీ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

కదిరి, జూలై 22: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీసీలు సీట్లు సాధించారు. రీమాతబ్సుమ్ 583, ఆపషా 581, ఎస్, ఆఫీసా 579, విద్యాప్రియ 579, హెప్సిబా సీటు సాధించి ట్రిపుల్ ఐటీసీలు సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటచలం సోమవారం తెలిపారు. దీంతో ఈ విద్యార్థులను ఆ పాఠశాల సిబ్బంది అభినందించారు.

చోరీకి విఫలయత్నం

గాండ్లపెంట, జూలై 22: స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారి పక్కన శీతల పానియాలు, టీ, తినుబండరాలు విక్రయించే ఓ దుకాణంలో ఓ బాలుడు చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ దుకాణాన్ని నాగకుమారి నిర్వహించేంది. ఆ దుకాణం ఊరి బయట ఉండటంతో పగలంతా అక్కడ వ్యాపారం చేసుకొని.. రాత్రి ఇంటికి వచ్చేది. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి కూడా నాగకుమారి దుకాణానికి తాళం వేసుకొని.. ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో దుకాణం వద్దకు వెళ్లగా.. 15 ఏళ్ల బాలుడు దుకాణం తాళం పగలగొట్టి... అందులోని వస్తువులన్నీ సంచిలో కట్టి బయటకు వేస్తుండటాన్ని గమనించింది. ఆ బాలుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా.. అతను ఆ వస్తువులను అక్కడే పారేసి పారిపోయాడు. దీనిపై నాగకుమారి ఎస్ఐ క్రిష్ణవేణికి ఫిర్యాదు చేసింది.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు

కదిరి లీగల్, జూలై 22: న్యాయవాది రామస్వామి ఇంటిపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం ఏడో రోజుకు చేరాయి. దీక్షలో రామస్వామి, జ్ఞానవర్ధన్‌రెడ్డి, నారాయణ, గంగాధర పాల్గొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయవాదులు జిల్లా నూతన ఎస్పీని కలిసి సమస్యను వివరించారు.

ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్పీ

కదిరి, జూలై 22: కదిరి డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులు, ఇతర విద్యా సిబ్బందికి టీచ్ టూల్ శిక్షణ ఇస్తు న్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభ మైన ఈ శిక్షణ 27 వరకు ఉంటుంది. సోమవారం ఉపాధ్యాయులకు మూడు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు రాష్ట్ర పరిశీలకుడు అబ్రహం లింక్ హాజరయ్యారు. ఆయన ఉపాధ్యా యులు బోధనలో పాటించాల్సిన మెలకువలు, పద్ధతులను వివరించారు. ఈ శిక్షణ ఉపాధ్యాయులకు బోధనలో చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, అసిస్టెంట్ జీసీడీఓ సంపూర్ణ, ఉపాధ్యాయులు, ఆర్పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నల్లచెరువు, జూలై 22: స్థానిక ప్రాథమిక పాఠశాలను డీఎల్‌పీఓ అంజనప్ప, ఈఓఆర్‌డీ నసీమా సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును, నాణ్యతను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ నిర్వాహకులకు మెనూ ప్రకారం, పౌష్టికాహారం వడ్డించాలన్నారు. అలాగే సచివాలయం -2ను తనిఖీ చేసి, హాజరు పుస్తకాలు పరిశీలించారు. సమయ పాలన పాటించన వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి వెంట కార్యదర్శులు వసుంధర, గోపీ, రమణప్పనాయుడు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

నిందితుడి అరెస్టు

నల్లమాడ, జూలై 22: మండలంలోని వేళ్లమద్ది పంచాయతీలోని పుట్టకొప్ప కొట్టాలలో 33 సంవత్సరాల క్రితం జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు అంజనప్పను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. 1987లో పుట్టకొప్పకొట్టాలో ఓ ఘర్షణ కేసులో అప్పటిలో 17మందిపై 147, 148, 324, 452, 149 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో ఏ16 నిందితుడు అయిన అంజనప్ప హాజరుకాకపోవడంతో కేసు లాంగ్ పెండింగ్ కేసుగా మారింది. నిందితుడు పులివెందలలో ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో సోమవారం వెళ్లి అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

భార్యపై దాడి

ధర్మవరం, జూలై 22: పట్టణంలోని లక్ష్మీచెన్న కేశవపురానికి చెందిన నల్లమ్మపై భర్త వెంకటేశ్ సోమవారం కర్రతో దాడిచేసి గాయపరిచాడు. నల్లమ్మ ఇంటిలో ఉన్న భర్త వెంకటేశ్‌ను రూ.50 అడిగింది. దీంతో ఆగ్రహించిన వెంకటేశ్ ఆమెతో గొడవ పెట్టుకుని కర్రతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

షిర్డీ సాయినాథుడికి విశేష పూజలు



పూజలందుకుంటున్న సాయినాథుడు

మడకశిర టౌన్, జూలై 22: పట్టణంలోని షిర్డీసాయినాథుడి ఆలయంలో బాబా మూలవిరాట్‌కు సోమవారం అభిషేకాలు, అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. రెండో రోజు సోమ వారం అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు.

నేడు భక్తరహళ్లి ఆలయ హుండీల లెక్కింపు

మడకశిర రూరల్, జూలై 22: మండలంలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్లి నరసంహస్వామి, జిల్లేడకుంట ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు దేవదాయాశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. రెండు గ్రామాల పెద్దలు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజావేదిక

హిందూపురం(సోమందేపల్లి),జూలై 22 : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 2023-24సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు నివేదికను సమర్పిస్తారన్నారు. కూలీలు, ఉపాధి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

రేపు మండల సమావేశం

గోరంట్ల, జూలై 22: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు. అధికారులు తమ శాఖ పరమైన ప్రగతి నివేదికలతో రావాలని ఆదేశించారు. సభ్యుల తరఫున కుటుంబ సభ్యులు, ఇతరులకు అనుమతి లేదన్నారు.

ప్రజాసమస్యల పట్ల శ్రద్ధ వహించండి

వీసీలో కలెక్టర్ ఆదేశం: ఎంపీడీఓ

మడకశిర(అమరాపురం), జూలై 22: ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ వహించాలని మండలంలోని అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ చేతన్ వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా ఆదేశాలను జారీ చేసినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రధానంగా సీజనల్ వ్యాధుల నిర్మూలన, పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ఇంటిపన్ను వసూలు, ఉపాధి హామీ కూలీలను పెంచడం తదితర వాటిపై దృష్టి పెట్టాలని సూచించారన్నారు. గ్రామాలలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మండలస్థాయి అధికారులతో ఎంపీడీఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగమణి, ఏపీఓ జగదీష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేనేతలకు పూర్వవైభవం తెస్తా

తొగట వీరక్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 22: చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తెస్తానని తొగట వీరక్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు హరి తెలిపారు. పట్టణానికి చెందిన పవర్ లూమ్స్, హ్యాండ్‌లూమ్స్ నిర్వాహకులు, కార్మికులు ఆయనను సోమవారం సోమందేపల్లిలోని స్వగృహంలో కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం పూలమాలు వేసి దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని చేనేతల సమస్యలను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తెచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ఆయనను సన్మానించారు.

యువతి ఆత్మహత్య



దీప మృతదేహం

హిందూపురం, జూలై 22 : మండలపరిధిలోని చౌళూరులో మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న దీప(25) అనే యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపారు. చౌళూరు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పార్వతమ్మ కుమార్తె దీప కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతుండేది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో పాటు ఆమెకు వివాహం కాలేదు. దీంతో జీవితంపై విరక్తిచెంది ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



సోమప్ప మృతదేహం

హిందూపురం, జూలై 22: మండలంలోని కగ్గల్లు గ్రామంలో సొంత ఇంటి మిద్దెపై శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి సోమప్ప(45)అనే వ్యక్తి మృతిచెందాడు. కగ్గల్లుకు చెందిన సోమప్ప సోమవారం ఉదయం తన సొంత ఇంటి మిద్దెపై శుభ్రం చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు ఆకస్మికంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదించిన తీరు కలిచివేసింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుల మృతికి సంతాపం

రొళ్ల, జూలై22: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండలపరిధిలోని అలుపనపల్లికి చెందిన వెంకటరెడ్డి, దాసప్పనపాళ్యం గ్రామాని చెందిన తిమ్మారెడ్డి అనారోగ్య కారణంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ దాసిరెడ్డి తదితరులు వారి స్వగ్రామాలకు వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుంచిటిగ వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, ప్రధానకార్యదర్శి ఈరన్న, బాలకృష్ణ, నాగరాజు, ఎస్సీసెల్ అధ్యక్షులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

మడకశిర రూరల్, జూలై 22: మండలంలో బుళ్ళసముద్రం గ్రామ బస్టాండ్ వద్ద ప్రధాన రోడ్డుపై ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బుళ్లసముద్రం గ్రామానికి చెందిన ప్రసాద్ (35) సోమవారం నడుచుకుంటూ ప్రధాన రోడ్డు దాటుతున్న సమయంలో హిందూపురం నుంచి మడకశిరకు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వచ్చి రోడ్డుపై ఉన్న ప్రసాద్ మృతదేహంపై పడి రోదించారు. సమాచారం అందుకున్న సీఐ మనోహర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. తల్లి రామాంజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వ్యక్తిగత సహాయకుడు రవికుమార్ ద్వారా రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందించారు.

వంతెన పనులను అడ్డుకున్న రైతులు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

● అధికారుల హామీతో సద్దుమణిగిన వివాదం

పెనుకొండ రూరల్, జూలై 22: మండలకేంద్రమైన రొద్దం సమీపంలో పెన్నానదిలో నిర్మిస్తున్న వంతెన పనులను సోమవారం రైతులు అడ్డుకున్నారు. తమ భూములు కోతలకు గురవుతాయని వంతెన నిర్మాణం ఎత్తు పెంచాలని నది చుట్టుపక్కల పొలాలున్న రైతులు డిమాండ్ చేశారు. రొద్దం సమీపంలో పెన్నానది ప్రవహించడంతో కొన్నేళ్లుగా రొద్దం నుంచి కుర్లపల్లి, కనుమర, నారనాగేపల్లి గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీకే పార్థసారథి చొరవతో రూ.1.80కోట్లతో వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. మొత్తం 180 మీటర్ల వంతెనలో 120 మీటర్ల వరకు పూర్తయింది. నదిలో మిగిలిన 60 మీరటర్ల వంతెన పనులను పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. అయితే పెన్నానది చుట్టుపక్కల ఉన్న రైతులు తమ పొలాలు కోతకు గురవుతాయని, వంతెన నిర్మాణం ఎత్తు పెంచాలని సోమవారం పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్ ఈఈ మురళి ఘటన స్థలానికి చేరుకుని భూమి కోతలు కోయకుండా భూముల చుట్టూ సేఫ్టీవాల్ నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం యథావిధిగా వంతెన పనులు చేపట్టారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు

అనంతపురం కల్చరల్, జూలై 22: బెంగళూరు నుంచి అనంతపురం వస్తున్న ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడిపత్రి డిపోకు చెందిన బస్సు సోమవారం సాయంత్రం 3.30 గంటలకు 50 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి అనంతపురం బయలుదేరింది. పెనుకొండ శివారుకు చేరుకోగానే ఇంజన్ సమస్యతో ఆగిపోయింది. బస్సు సెల్ఫ్ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు కిందకు దిగి తోయాల్సి వచ్చింది. అనంతరం బస్సు స్టార్ట్ అయ్యి అనంతపురం చేరకునేలోపు మరో రెండు సార్లు ఆగిపోయవడంతో ప్రయాణికులే మళ్లీ తోయాల్సి వచ్చింది. బస్సు తరచూ మొరాయిస్తుండటంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది

హిందూపురం(పరిగి), జూలై 22: ప్రస్తుతం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన శంకరయ్య అనే కానిస్టేబుల్ కొన్ని రోజుల కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నప్పు ఓ నిందితుడిని పట్టుకునే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. ప్రస్తుతం మెడికల్ లీవులో ఉన్నాడు. ఆయన సర్జరీ కోసం ఆర్థిక స్థోమత లేక కుటుంబసభ్యులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని పరిగి ఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ రామిరెడ్డి, సిబ్బంది తదితరులు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వైద్యచికిత్సల కోసం తమ వంతుగా రూ.1.10లక్షలు ఆర్థిక సహాయాన్ని శంకరయ్య సతీమణికి అందించారు.

బాల్యవివాహాలను అరికడదాం

మడకశిర(అమరాపురం), జూలై 22: అమరాపురం మండల పరిధిలోని గౌడనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్డీటీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడదాం... ఆడబిడ్డలను కాపాడుదాం... అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ మహిళా విభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాఘవయ్య, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఐసీడీఎస్ గుడిబండ సూపర్‌వైజర్ కమలమ్మ, ఈఓఆర్డీ నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసికంగా, శారీరకంగా అనారోగ్యం పాలవుతారని తెలిపారు. బాల్య వివాహాలకు సహకరించిన ప్రతి ఒక్కరూ శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఎవరైనా బాల్య వివాహాలు జరిపించాలని చూస్తే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ, వీఆర్ఓ మహేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యపై దాడి

ధర్మవరం, జూలై 22: పట్టణంలోని లక్ష్మీచెన్న కేశవ పురానికి చెందిన నల్లమ్మపై భర్త వెంకటేష్ సోమవారం కర్రతో దాడిచేసి గాయపరిచాడు. నల్లమ్మ ఇంటిలో ఉన్న భర్త వెంకటేష్‌ను రూ.50 అడిగింది. దీంతో ఆగ్రహించిన వెంకటేష్ ఆమెతో గొడవ పెట్టుకుని కర్రతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దుకాణంలో చోరీ

అనంతపురం క్రైం, జూలై 22: నగరంలోని కొవూరునగర్‌లో ఓ దుకాణంలో చోరీ జరిగింది. జాతీయ రహదారి సమీపంలో శ్రీనివాసులు అనే వ్యక్తి జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దొంగలు షట్టర్ తాళాలు పగలగొట్టి దుకాణంలోని క్యాష్‌కౌంటర్‌లోని రూ.18వేల నగదు, చాక్లెట్లు, సిగరెట్లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తురుకువాండ్లపల్లిలో సబ్ కలెక్టర్ పర్యటన



పార్వతమ్మతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మడకశిర రూరల్, జూలై 22: మండలంలోని తురుకువాండ్లపల్లిలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సోమవారం సాయంత్ర ఆకస్మికంగా పర్యటించారు. తనకు ముగ్గురు కొడుకలని, వారెవ్వరూ తనను సక్రమంగా చూసుకోవడం లేదని తురుకువాండ్లపల్లికి చెందిన పార్వతమ్మ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తెలిపారు. కావున వారికి ఇచ్చిన ఆరెకరాల భూమిని తిరిగి వెనక్కి ఇప్పించాలని అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. దానిని పరిశీలించిన సబ్ కలెక్టర్ తక్షణమే స్పందించారు. సాయంత్రం తురుకువాండ్లపల్లిలో పర్యటించి పార్వతమ్మ కుటుంబ పరిస్థితిని విచారించారు. ఆమె ముగ్గురు కొడుకుల్లో ఒకరు మృతిచెందారు. మిగిలిన ఇద్దరూ వేరే గ్రామంలో ఉంటున్నారు. దీంతో వారిని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి రావాలని ఆదేశించి వెళ్లారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్, డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు, వీఆర్వో ధర్మేంద్ర తదితరులు ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

● ఎంపీడీఓకు మందపల్లి గ్రామస్థుల ఫిర్యాదు

గోరంట్ల, జూలై 22: మండలంలోని మందపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ సదాస విధులకు సరిగా రావడం లేదని, గ్రామస్థులు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వారు టీడీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డిజిటల్ అసిస్టెంట్ సదాస ప్రతి రోజు ఉదయం 11గంటలపైన సచివాలయానికి వస్తుండడంతో, ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోందన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. ఈ విషయాన్ని గతంలోనే ఎంపీడీఓకు ఫోన్‌ద్వారా సమాచారం అందించినా పట్టించుకోలే దని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు. గ్రామస్థులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పరిశీలించిన ఎంపీడీఓ వెంటనే డిజిటల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తామని తెలిపారు. మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యులు అజంతుల్లా, గ్రామస్థులు బోయ కిష్టప్ప, చలపతి, జయచంద్ర, మారుతి, నాగేంద్ర, క్రిష్టారెడ్డి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోండి

● తహసీల్దార్‌కు సీపీఎం నాయకుల వినతి

హిందూపురం(సోమందేపల్లి), జూలై 22 : మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీలో పేదలకు ఇళ్లు, ప్రజా ప్రయోజనాల నిమిత్తం వదిలిన స్థలం మినహా మిగిలిన 25ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైం దని సీపీఎం నాయకులు తహసీల్దార్ అంజనాదేవికి ఫిర్యాదు చేశారు. వారు సోమవారం స్థానిక తహసల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కలిసి... అన్యాక్రాంతమైన భూమిని స్వాదీనం చేసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ... సోమందేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 2009 అప్పటి ప్రభుత్వం పేదలకు ఇళ్ల కోసం భూసేకరణ ద్వారా 60ఎకరాలు సేకరించిందన్నారు. అయితే 35ఎకరాల్లో దశలవారీగా పేదలకు ఇళ్లు, ప్రజాప్రయోజనాల కోసం 35ఎకరాలను వినియోగించుకుందన్నారు. మిగిలిన 25 ఎకరాలను కొంతమంది ఆక్రమించారన్నారు. వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకున్ని ఇల్లులేని నిరుపేదలకు ఇంటిపట్టాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గౌతమి, ఈడిగ లక్ష్మీనారాయణ, రామక్రిష్ణ, కొండా వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం

గాండ్లపెంట, జూలై 22: స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారి పక్కన శీతల పానీయాలు, టీ, తినుబండరాలు విక్రయించే ఓ దుకాణంలో ఓ బాలుడు చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ దుకాణాన్ని నాగకుమారి నిర్వహించేంది. ఆ దుకాణం ఊరి బయట ఉండటంతో పగలంతా అక్కడ వ్యాపారం చేసుకొని.. రాత్రి ఇంటికి వచ్చేది. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి కూడా నాగకుమారి దుకాణానికి తాళం వేసుకొని.. ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో దుకాణం వద్దకు వెళ్లగా.. 15 ఏళ్ల బాలుడు దుకాణం తాళం పగలగొట్టి... అందులోని వస్తువులన్నీ సంచిలో కట్టి బయటకు వేస్తుండటాన్ని గమనించింది. ఆ బాలుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా.. అతను ఆ వస్తువులను అక్కడే పారేసి పారిపోయాడు. దీనిపై నాగకుమారి ఎస్ఐ క్రిష్ణవేణికి ఫిర్యాదు చేసింది.

ప్రభుత్వ స్థలం ఆక్రమించారు

తహసీల్దార్‌కు ఖాజాపురం వాసుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

గోరంట్ల, జూలై 22: మండలంలోని ఖాజాపురం సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ స్థానిక నాయకుడు గొల్ల కిష్టప్ప అక్రమంగా ఆక్రమించి, షెడ్ నిర్మిస్తున్నారని పలువురు గ్రామస్థులు తహసీల్దార్ అక్బల్ బాషాకు ఫిర్యాదు చేశారు. వారు సోమవారం టీడీపీ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఖాజాపురం గ్రామంలోని సర్వేనెంబర్ 274లో 1.62 ఎకరాల ప్రభుత్వ స్థలముండగా అందులో దాదాపు 30సెంట్లను గొల్ల కిష్టప్ప ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. అయితే ఆ స్థల వివాదంపై కోర్టు స్టే విధించినందును తాము ఏమీ చేయలేమని తహసీల్దార్ తెలిపారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ... ఖాజాపురం వద్దనే సర్వేనెంబర్ 278- 1లో 7.74ఎకరాల తోపు, పరంబోకు స్థలం ఉందని, దాని పక్కనే సర్వేనెంబర్ 278-2లోని 28 సెంట్ల భూమిలో గొల్ల కిష్టప్ప బోరు వేసి, పంట సాగుచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టగా స్థానికులు అభ్యంతరం తెలుపడంతో పై రెండు నెంబర్లపై ఆయన కోర్టుకు వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. అయితే ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్న వాటికి సంబంధం లేదన్నారు. సర్వేనెంబర్ 274 స్థలంపై ఎలాంటి అంక్షలు లేవని గుర్తు చేశారు. దీంతో పరిశీలించి చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీ నర్ సోమశేఖర్, మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

కత్తెర పురుగు నివారణపై అవగాహన



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

లేపాక్షి, జూలై 22 : మండలంలోని రైతులు సాగుచేసిన మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో పర్యటించి మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంటను కత్తెర పురుగును ఆశించడంతో దాని నివారణకు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కజొన్న సాగుచేసిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పంటకు వాడాల్సిన మందులను ఆయన వివరించారు. అలాగే వేరుశనగ, వరి పంటల్లో యాజమాన్య పద్ధతులతో పాటు పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల, వాటి నివారణ, విత్తనశుద్ధి, ఎరువుల ఉపయోగం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులుగా ఎదగాలి: ఏఓ

గుడిబండ, జూలై 22: రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెంది ఆదర్శ రైతులుగా ఎదగాలని ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. గుడిబండ రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆయన సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏఓ మాట్లాడుతూ... ప్రస్తుతం ఖరీఫ్, వచ్చే రబీలో రైతులు మెట్ట పొలాల్లో, బోరు బావుల కింద విరివిగా ప్రత్యామ్నాయ పంటలుసాగుచేసి అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలన్నారు. వ్యవసాయాధికారు లు ఇచ్చే సలహాలు, సూచనలు రైతులు తప్పక పాటించినట్లయితే పంట అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సజ్జలు తదితర వాటిని అందించారు. కార్యక్రమంలో ఏపీమార్క్స్ డైరెక్టర్ గోపాల్‌రాజు, ఎఫ్‌బీఓసీసీ దేవరాజు, సంఘం అధ్యక్షులు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యువతి కడుపులో మూడుకిలోల కణితి



వైద్య బృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ రోహిల్ కుమార్

హిందూపురం అర్బన్, జూలై 22: ఓ యువతి కడుపులో ఉన్న మూడు కిలోల భారీ కణితిని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు తొలగించారు. పట్టణ పరిధిలోని మోతుకపల్లిలో నివాసముంటున్న మురళి భార్య కల్పన కడుపులో భారీ కణితి ఉన్నట్లు వైద్యుల పరీక్షల్లో తేలింది. దీంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని సివిల్ సర్జన్, స్పెషలిస్ట్ డాక్టర్ బాబా బుడేన్ సోమవారం ఉదయం ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. ప్రస్తుతం కల్పన క్షేమంగా ఉన్నారు. డాక్టర్ బాబా బుడేన్ మాట్లాడుతూ ఇన్నాళ్లు కల్పన మూడు కిలోల కణితిని మోశారన్నారు. ఆ కణితి వల్ల చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆపరేషన్ సక్సెస్ కావడంతో కల్పన భర్త మురళితో పాటు సూపరింటెండెంట్ రోహిల్ డాక్టర్ బాబా బుడేన్‌ను, సిబ్బందిని అభినందించారు.

భువనేశ్వరీమాత రథయాత్రకు ఘనస్వాగతం



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న అధికారులు తదితరులు

పావగడ, జూలై 22: కన్నడమాత భువనేశ్వరి రథయాత్రకు సోమవారం పావగడలో అధికారులు, కన్నడ సంఘాలు, బౌద్ధ సంఘం నాయకుల ఘనస్వాగతం లభించింది. శిర నుంచి మధ్యాహ్నం 3గంటలకు తరలివచ్చిన రథానికి తాలూకాలోని అర్సిగెర గ్రామంలో తహసీల్దార్ వరదరాజులు, ఈఓ జానకిరామ్, బీఈఓ ఇంద్రాణి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తదితరులు విద్యార్థులతో కలిసి ఘనస్వాగతం పలికారు. కర్ణాటక రాష్ట్రంగా ఏర్పడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు బీఈఓ ఇంద్రాణి తెలిపారు. పలు సాంస్కృతి కార్యక్రమాల నడుమ రథోత్సవం సాగిస్తూ సాయంత్రం బెంగళూరుకు సాగనంపారు.

పార్టీలకు అతీతంగా పనిచేయండి

పోలీసులకు తుమకూరు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

పావగడ, జూలై 22: రాజ్యాంగ పర్యవేక్షణలో ఎవరికీ అనుకూలం కాకుండా.... పార్టీలకు అతీతంగా పనిచేయాలని తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. ఆయన సోమవారం పావగడ పట్టణంలోని ఎస్ఎస్‌కె రంగ మందిరంలో జేడీఎస్ పార్టీ నాయకుల విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పావగడలో పోలీసులు ఒక పార్టీకి, ఒక వర్గానికి మద్దతునిస్తూ జేడీఎస్ కార్యకర్తలపై అకారణంగా కేసులు నమోదుచేసి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు పోలీసుల వైఖరిని ఖండిస్తూ పావగడలో ర్యాలీకి సిద్ధమయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ పావగడకు చేరుకుని జేడీఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఇకపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడంకానీ, చట్టపరమైన వ్యతిరేక చర్యలు చేపట్టినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాజ్యాంగంలో ఎవరికైనా ఒకే శిక్షలు ఉంటాయని దానిని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు అనుచితంగా వ్యవహరిస్తే తమదృష్టికి తీసుకురావాలని ప్రజల సేవ కోసం తామెప్పుడు సిద్ధంగా ఉంటామని ఎస్పీ తెలుపడంతో జేడీఎస్ నాయకులు ధర్నా విరమించారు.

'బోరుబావికి ఆధార్‌లింక్ వద్దు'

పావగడ, జూలై 22: వ్యవసాయ బోరుబావులకు ఆధార్ లింక్ చేయడాన్ని రద్దుచేయాలని రైతు సంఘం తుమకూరు జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ఆదివారం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందించారు. కొత్తగా బోరువేసుకున్న రైతులకు ఆధార్ లింక్ చేయడంతో కరెంటు కోతతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన వాపోయారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయం బోర్లకు ఆధార్‌లింక్‌ను రద్దుచేయాలని, లేనిపక్షంలో జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో అధికారులకు రైతుల సమక్షంలో అందజేశారు.